# మంచితనంలో మర్మం

**శం**కర్రావు తన చెవులను తానే నమ్మలేక "ఏమిట్రా నువ్వంటున్నది?" అన్నాడు ఆశ్చర్యంగా .

"అవును మామయ్యా! పద్మను పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను. అమ్మా నాన్నతో మాట్లాడి ముహూర్తం పెట్టించు. అనవసరమైన ఆడంబరాలకు మనీ వేస్ట్ చేయకు" అన్నాడు మాధవరావు. శంకర్రావు మహదానంద పడ్డాడు.

శంకర్రావు మంచి పొదుపరి. అతనికి అన్నదమ్ములుగానీ అప్పచెల్లెళ్లుగానీ లేరు. చదువుకునే రోజుల్లో సినిమాలు, షికార్లు, కాఫీ, టీ, సిగరెట్ వంటి వాటి జోలికి పోలేదు. పెద్ద చదువులు చదివే స్తోమత, అవకాశం ఉన్నా మెట్రిక్ పాసై టైపు నేర్చుకుని గవర్నమెంటు జాబ్ సంపాదించాడు.

శంకర్రావు భార్య భవానీ అతనికి అన్నివిధాలా తగిన ఇల్లాలు. వారికి ఒక కొడుకు కొండల్రావు, కూతరు పద్మ. పిల్లల్ని ఎంతో క్రమశిక్షణతో పెంచేడు శంకర్రావు. తండ్రి పిసినారితనాన్ని భరిస్తూ బిఎ అనిపించింది పద్మ. కొండల్రావు తల్లి ముద్దువలన ఇంకా మెట్రిక్ పూర్తిచేయలేదు.

శంకర్రావు ఆఫీసర్‌గా ప్రమోషన్ రాగానే అంతవరకూ కూడబెట్టిన సొమ్ముతో ఇల్లు కొని దాన్ని నాలుగు పోర్షన్స్ చేసి ఒకదానిలో తానుంటూ మిగిలిన పోర్షన్స్ అద్దెకిచ్చాడు.

శంకర్రావు కూతురు పద్మకు అతని కొలీగ్స్ మంచి సంబంధాలు తీసుకువచ్చారు. సంబంధాలు బాగున్నా వారడిగిన కట్నాలకు అదిరి పోయి అన్నిటినీ తిరగ్గొట్టేడు. మేనల్లుడు మాధవరావు కట్నం లేకుండా తన కూతుర్ని చేసుకుంటున్నాడని ఎంతో గొప్పగా అందరికీ చాటి చెప్పాడు. అల్లుడి మంచితనాన్ని మెచ్చుకుని అతని ఆదర్శాలను పొగిడాడు.

శంకర్రావు తన కజిన్ సిస్టర్ అనంతలక్ష్మిని, బావగార్ని కలసి మాధవరావుకి తన కూతురు

పద్మను చేసుకొమ్మని ఫార్మల్‌గా అడిగి మాధవరావు కట్నకానుకలు వద్దన్న విషయం కూడా చెప్పి ముహూర్తాలు పెట్టమన్నాడు.

"తోడబుట్టిన అన్నదమ్ములకంటే నువ్వే నయంరా శంకరం! ఎంతో అభిమానంతో నీ కూతుర్ని మా కోడలుగా చేసుకోమన్నావు. చాలా ఆనందంగా ఉంది. నేను నోరు విడిచి అడిగినా వాళ్లు మాట్లాడకుండా పై సంబంధాలు చేసేరు వాళ్ల కూతుళ్లకి" అంది అనంతలక్ష్మి. భర్తతో చెప్పి వెంటనే ముహూర్తాలు పెట్టించింది.

మాధవరావు కోరిన విధంగానే ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా పెళ్లి జరిపించాడు. పెళ్లయిన మర్నాడు-

"శంకరం మామయ్యా! నాకు మరి సెలవు లేదు. రేపే మద్రాసు ప్రయాణం. పద్మకు పెళ్లిచేసి ఇంటిదానివి చేసావు. మరి ఇల్లు ఉండాలి కదా. అందుచేత ఈ ఇల్లు పద్మ పేర రాసి రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు సాయంత్రానికల్లా వచ్చేలా చూడు. నాకు జపాన్‌లో మంచి జాబ్ వచ్చింది. నాలుగేళ్లు బాండ్ మీద వెళ్తున్నాను. పద్మను కూడా నాతో జపాన్ తీసుకెళ్తాను. వీసా, పాస్‌పోర్ట్ లకు రెండు లక్షలు అవుతుంది. కేష్ రెడీ చేసి ఉంచు. రేపు వెళ్తున్నప్పుడు తీసుకెళ్తా" అన్న అల్లుడి మాటలు విని మూర్ఛపోయాడు శంకర్రావు. అదే సమయంలో-

"అల్లుని మంచితనంబును....సాహిత్య విద్య కోమలి నిజమున్ బొల్లున దంచిన బియ్యము తెల్లని కాకులును లేవు తెలియర సుమతీ" అంటూ ప్రక్క పోర్షన్‌లోని కుర్రాడు సుమతీ శతకంలో పద్యం బిగ్గరగా చదువుతున్నాడు.

**(ఆంధ్రభూమి వారపత్రిక, 22-10-1998)**